



నేటి దినపత్రిక
# సూర్య
ఉత్తరాంధ్ర
సోమవారం
10-6-2024
పేజీలు 4
www.suryaa.com
విశాఖ - అనకాపల్లి - అల్లూరి - మన్యం
విజయనగరం
శ్రీకాకుళం


## ఢిల్లీ సాక్షిగా..
# నాడు తండ్రి.. నేడు తనయుడు





-కింజరాపు రామ్మోహన్‌కు అరుదైన పదవి
-కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం
-మోదీ కేబినెట్‌లో అత్యంత పిన్న వయస్కుడు కూడా..

(సూర్య బ్యూరో-శ్రీకాకుళం)

ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఉల్లాసంగా జరిగింది. మోదీ క్యాబినెట్‌లో శ్రీకాకుళం టీడీపీ ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు కొలువుదీరారు. పిన్న వయస్కుడుగా పేరొందిన రామ్మోహన్‌నాయుడు కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు.

**అందరి చూపు కింజరాపు వైపే..**

రాష్ట్రపతి భవన్‌లో మంత్రివర్గం ప్రమాణస్వీకార కార్యక్రమంలో అందరి చూపు కింజరాపు వైపే వుంది. మోదీ క్యాబినెట్‌లో శ్రీకాకుళం టీడీపీ ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న కింజారపు రామ్మోహన్ నాయుడు అత్యంత పిన్న వయస్కుడు(తక్కువ వయసు) కావడం విశేషం. శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి 2014, 2019, 2024 (మూడు సార్లు) ఎంపీగా ఎన్నికైన రామ్మోహన్ వయసు 36 సంవత్సరాలే. ఆయన 26 ఏళ్లకే తొలిసారి ఎంపీగా గెలుపొందారు. కాగా... కింజరాపు రామ్మోహన్ తండ్రి ఎర్రన్నాయుడు కూడా కేంద్ర మంత్రిగా కొనసాగారు. స్వర్గీయ ఎర్రన్నాయుడు వాజ్‌పేయి మంత్రివర్గంలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా కొనసాగారు.

**చిన్న వయస్సులో కేంద్ర మంత్రి**

అతి పిన్న వయస్సులోనే కేంద్ర మంత్రి కాబోతున్న కింజరాపు రామ్మోహన్ నాయుడు గురించి ఇప్పుడు దేశమంతా ఆసక్తిగా చూస్తోంది. ఆయన కోసం కొద్దిగా తెలుసుకుందాం. డిసెంబర్ 18, 1987లో ఆయన శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో జన్మించారు. దేశంలో అట్టడుగున ఉన్న శ్రీకాకుళం జిల్లా నుంచి, భారత రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగిండీ స్వర్గీయ కింజరావు ఎర్రన్నాయుడేనన్నది అందరికీ తెలిసిందే. ఆయన 25ఏళ్లకే ఎమ్మెల్యేగా ఎన్నికైతే ఆయన తనయుడు రామ్మోహన్ 26ఏళ్ళకే ఎంపీగా ఎన్నికయ్యారు. మూడో పర్యాయం ఎన్నికైన రామ్మోహన్ 36ఏళ్లకే కేంద్ర మంత్రి అయ్యారు. యువ చైతన్యానికి ఇదో వెలుగు అని చెప్పుకోవచ్చు. ప్రజా సేవ, రాజకీయ చతురత వారసత్వంగా రామ్మోహన్ పేరొందారని చెప్పవచ్చు.

**రామ్మోహన్ విద్యాభ్యాసం**

రామ్మోహన్ తన పాఠశాల విద్యను ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (ఆర్కే పురం)లో పూర్తి చేశారు. అనంతరం ప్రఖ్యాత పర్డ్యూ విశ్వవిద్యాలయం నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో అండర్ గ్రాడ్యుయేట్ అభ్యసించారు. ఆ తర్వాత లాంగ్ ఐలాండ్ నుంచి ఎంబీయే చేశారు.

**రాజకీయంలో మెట్లు**

రామ్మోహన్ తొలుత సింగపూర్‌లో కెరీర్ ప్రారంభించారు. 2012లో తన తండ్రి కారు ప్రమాదంలో మృతి చెందిన అనంతరం విధి ఆయన్ను తిరిగి రాజకీయ మూలాల్లోకి లాక్కెళ్లింది. ఆయన తండ్రి మృతి సంఘటనే రామ్మోహన్‌ను రాజకీయ రంగానికి పరిచయం చేసింది. 26 ఏళ్ల వయస్సులో, అతను 2014లో శ్రీకాకుళం నుంచి లోక్‌సభ ఎంపీగా పోటీ చేసి గెలిచి, 16వ లోక్‌సభలో రెండో అతి పిన్న వయస్కుడైన ఎంపీగా అలరించారు.

**చంద్రబాబుతో అనుబంధం**

18వ లోక్‌సభ ఎన్నికల్లో 3.27 లక్షల మెజార్టీతో రామ్మోహన్ అద్భుతమైన విజయాన్ని సాధించారు. ఇదిలా ఉంటే రామ్మోహన్ 2017లో శ్రీశ్రావ్యను (మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి తనయ) వివాహం చేసుకున్నారు. వారికి 2021లో ఒక కుమార్తె పుట్టింది. రామ్మోహన్ అంకితభావంతో కూడిన కుటుంబ వ్యక్తి మాత్రమే కాదు, రాజకీయాల్లో కూడా మూస పద్ధతుల్ని బద్దలు కొట్టారని భావించొచ్చు. తన భార్య గర్భం కోసం 2021బడ్జెట్ (పార్లమెంట్) సెషన్లలో.. పితృత్వ సెలవు తీసుకోవాలనే ఆయన నిర్ణయం లింగ హక్కులు.. విద్యపై ఆరోగ్యకరమైన చర్చలకు దారి తీసింది. పార్లమెంట్‌లోనూ రుతుక్రమ ఆరోగ్య విద్య, లైంగిక విద్య కోసం వాదించిన తొట్టతొలి ఎంపీల్లో ఆయనొకరయ్యారు. అంతేకాకుండా శానిటరీ ప్యాడ్‌లపై జీఎస్టీని తొలగించాలంటూ రామ్మోహన్ చురుకుగా ప్రచారం కూడా చేశారు.

**యువతకు చేదోడు**

రాజకీయాల్లో యువత మిగతా 2లో

## ఎమ్మెల్యేలకు ప్రభుత్వ ఉద్యోగుల సత్కారం

-సిబ్బందికి తమ సహకారం తప్పక ఉంటుందని శాసన సభ్యుల హామీ -విశాఖలో అభినందనల వెల్లువ




## వైసీపీలో 'లక్కీ' గొల్ల బాబూరావు



**విశాఖపట్నం, జూన్ 9, మేజర్‌న్యూస్:** ఉత్తరాంధ్ర జిల్లాల్లోని వైసీపీ నాయకులందరికన్నా గొల్ల బాబూరావే అదృష్టవంతుడు. పాయకరావుపేట నియోజకవర్గం నుంచి పార్టీ అధిష్టానం ఆయన్ను తప్పించింది. ఎన్నికలకు ఆర్నెళ్ల ముందు నుంచే బాబూరావుకు టిక్కెట్ ఇవ్వడం లేదని తేల్చేసింది. అయితే అదే సమయంలో రానున్న ఖాళీల్లో రాజ్యసభకు పంపుతామని అధిష్టానం ఆయనకు హామీ ఇచ్చింది. ఇలా అంటారు గానీ నిజంగా రాజ్యసభ టిక్కెట్ ఇస్తారా అన్న అనుమానం అప్పట్లో రాకపోలేదు. కానీ అదృష్టం కొద్దీ అసెంబ్లీ ఎన్నికలకు ముందే బాబూరావును రాజ్యసభ సీటు వరించింది. అసెంబ్లీకి వెళ్లి ఉంటే బాబూరావుకు మంత్రి పదవి వచ్చి ఉండేదని అప్పట్లో కాస్త ఆశగా ఉన్నా..ఎన్నికల తర్వాత అర్థమైంది తానెంత అదృష్టవంతుడ్నోనని. అరకు, పాడేరు తప్పా ఉత్తరాంధ్రా మొత్తం వైసీపీ తుడుచు పెట్టుకు పోయింది. పాయకరావుపేట నుంచి అసెంబ్లీకి మిగతా 2లో


## జేయింట్ వీల్ ఎగ్జిబిషన్

ప్రారంభించిన ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, తాజా మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి




## జిల్లా అధికారుల్లో బదిలీల గుబులు

-ఎన్నికల ఫలితాలతో కంగుతిన్న అధికారులు -వైసీపీకి నమ్మిన బంటుల్లా.. ఇన్నేళ్లు..!
-ప్రభుత్వం మారడంతో డీలా పడి బదిలీ అయ్యేందుకు సిద్ధం
-కలెక్టర్ నుంచి మండల స్థాయి వరకూ బదిలీలు



**విశాఖపట్నం, జూన్ 9, మేజర్‌న్యూస్:** ఎన్నికల ఫలితాలతో జిల్లా అధికారులు డీలా పడ్డారు. ఈ నెల 4వ తేదీన ఫలితాలు వచ్చినప్పటి నుంచీ జిల్లా స్థాయి అధికారులు గుట్టుగా ఉంటున్నారు. రెండు మూడేళ్లుగా విశాఖలోనే మకాం వేసిన ముఖ్యమైన విభాగాల అధికారులకు ఈ సారి స్థాన చలనం తప్పదన్న భావనతో ఇక ఎలాంటి ప్రయత్నాలు చేసినా ఫలితం రాదనే ఉద్దేశ్యంతో తన పని చేసుకుపోతున్నారు. అందుకే ఇప్పుడు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలను సైతం అంటీఅంటనట్టుగా...కూటమి పార్టీ నేతలతో దూరంగానే ఉంటున్నారు. కార్యాలయాల్లో కలిసేందుకు కూడా లోనికి ఎవరినీ అనుమతించడం లేదని తెలుస్తోంది. రెగ్యులర్‌గా వచ్చే ఫైళ్లను మాత్రమే పరిశీలిస్తున్నారు. పాలనలో ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదని ఆయా కార్యాలయాల్లోని సిబ్బంది చెబుతున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం రావడంతో పాలన యంత్రాంగంలో భారీ మార్పులు చోటు చేసుకోనున్నాయి. జిల్లాలో కీలక స్థానాల్లో పనిచేస్తున్న అధికారుల్లో ఎక్కువ మంది గత మూడేళ్ల నుంచి కొనసాగుతున్నారు. ఒకరిద్దరు అధికారులు తప్ప అధిక శాతం మంది దీర్ఘకాలం నుంచి ఇక్కడ పనిచేస్తున్నవారే కావడంతో పలువురికి స్థాన చలనం కలిగే అవకాశాలున్నాయని యంత్రాంగం భావిస్తోంది. రాష్ట్ర స్థాయిలో కీలక అధికారుల మార్పులు, చేర్పులు శర వేగంగా జరుగుతున్నాయి. కొత్త ప్రభుత్వం కొలువు దీరిన అనంతరం జిల్లాల వారీ ప్రక్షాళన మొదలుకానుంది. రాష్ట్రంలో అత్యంత కీలక జిల్లాగా పేరొందని విశాఖపై అందరి చూపు ఉంది.

**ఉన్నత స్థాయి అధికారులే ఏళ్ళ తరబడి..!**

జిల్లాల పునర్విభజన తర్వాత ఎక్కువ మంది మిగతా 2లో

## మలేరియా విజృంభిస్తున్నా పట్టింపు లేదా?

- దోమ తెరలెక్కడ మహాశయా? -కనీస సౌకర్యాల్నీ కల్పించరు..ఆరోగ్య భాగ్యమూ ఇవ్వరు -ఏజెన్సీలో గిరిజనుల హాహాకారాలు

**విశాఖపట్నం, జూన్ 9, మేజర్‌న్యూస్:** ఏజెన్సీ గ్రామాల్లో గిరిజనులేమైపోయినా ఫరవాలేదనట్టు వైద్య, ఆరోగ్యశాఖ వ్యవహరిస్తోంది. మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తనట్టున్నారు. అల్లూరి జిల్లా అనంతగిరి మండలం రొంపిల్లి తదితర కొండ శిఖర గ్రామాల్లో రెండేళ్లగా మలేరియా నరకం చూపిస్తోంది. గిరిజనులు ఇక్కట్లు పడుతున్నా వైద్య సిబ్బంది పట్టనట్టే ఉన్నారు. ఆ గ్రామాల్లో 28కుటుంబాల్లో 150మంది జనాభా నివసిస్తున్నారు. చాన్నాళ్లగా ఇక్కడ సరైన వసతులు లేవు. దోమ తెరల పంపిణీ అంటే ఏంటో తెలీదు. ఇళ్లలోపల స్ప్రేయింగ్ చేయరు. జ్వరాలతో బాధపడుతున్నా పట్టింపులేదు. ఇటీవల ఇక్కడ వైద్య సౌకర్యం లేకపోవడంతో చాలా మంది విజయనగరం జిల్లా గజపతినగరం వైద్యాలయానికి వెళ్లాల్సి వచ్చింది.

**ఎందుకీ దుస్థితి**

తమ ప్రాంతంలో ఆస్పత్రి లేకపోవడంతో సోములు వీరయ్య (60), బద్నయిన కొత్తమ్మ (30), బూరుగ సుంకరయ్య (22), సోముల పోలమ్మ (20), సోముల జెంట్స్ మేరీ (4), పొట్టంగి పోలయ్య, బడ్నాయిని బుజ్జిబాబు, బడ్నాయిని కిరణ్ కుమార్ తదితరుల్ని ఇతర ఆస్పత్రిలో చేర్పించాల్సి వచ్చింది. ముగ్గురు చికిత్స నిమిత్తం వచ్చేయగా, మిగతా వారంతా ఆస్పత్రిలోనే ఉన్నారు. వీరిని ఆస్పత్రికి తీసుకు వెళ్లేందుకు కూడా నరకం చూడాల్సి వచ్చింది. డోలీల్లో 8కి.మీ మేర మోసుకుని ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. మరికొంతమందిని ద్విచక్ర వాహనాలపై ఎన్ఆర్ పురం మీదుగా ఎస్‌కోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పాడేరు జిల్లాలో అంత పెద్ద వ్యవస్థ ఉండగా గిరిజనులకు ఈ దుస్థితి ఎందుకంటే ఎవరూ సమాధానం చెప్పలేని పరిస్థితి. ఎస్‌కోట ఆస్పత్రిలో బూరుగ రామకృష్ణ (13), సోముల పోలమ్మ (30), సోముల సోములమ్మ, సోముల ఆదమ్మ (23), గాలిపత్తి చెన్నమ్మ (18), గాలిపత్తి సొట్టయ్య (21), సోముల ఎర్రయ్య (60), బురుగా రవి



(5), బూరిగ కవిత (2.5 ఏళ్లు)చికిత్సకు చేరగా, వీరిలో సగం మంది ఇంటికొచ్చేశారు. ఏటా తమకివే తిప్పలని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**50కి.మీ వెళ్లాల్సిందే**

అక్కడి ప్రజలకు ఏ చిన్న ఆపద వచ్చినా 50కి.మీ దూరంలో ఉన్న భీమవరం పీహెచ్‌సీకి వెళ్లాల్సిందే. దీంతో కొద్దోగొప్పో కష్టపడి మిగతా 2లో

# ఎమ్మెల్యేలకు ప్రభుత్వ ఉద్యోగుల సత్కారం

**విశాఖపట్నం, జూన్ 9, మేజర్‌న్యూస్:** తాజా ఎన్నికల్లో అద్భుత విజయం సాధించిన విశాఖ జిల్లా ఎమ్మెల్యేల్ని విశాఖ జిల్లా ఏపీ జేఏసీ (అమరావతి)త రఫున ప్రభుత్వ ఉద్యోగులు ఆదివారం అభినందించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ, విశాఖ పశ్చిమ శాసన సభ్యులు పెతకంశెట్టి గణబాబు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును వీరంతా మర్యాద పూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏప జేఏసీ (అమరావతి) చైర్మన్ సత్తి నాగేశ్వర రెడ్డి, ప్రధాన కార్యదర్శి కేఎస్ రావు, ఏపీఆర్ఎస్ఏ విశాఖ జిల్లా అధ్యక్షులు, జేఏసీ సహ చైర్మన్ ఎస్ఏ త్రినాథ రావు, ఏపీఆర్ఎస్ఏ జిల్లా కార్యదర్శి సీహెచ్‌వీ రమేష్,

ఆర్టీసీ ఎంప్లాయిస్ తరఫున పి.సిద్ధిగణేష్, జీవీఎంసీ ఎంప్లాయిస్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పల రాజు, కోశాధికారి ఎం. రవి, గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. సురేష్, రెవెన్యూ సంఘం సిటీ అధ్యక్షులు యోగి, కార్యదర్శి రవిశంకర్, ఆ సంఘం ఇతర నాయకులు రాజేష్, మహేష్, సుధాకర్, వరుణ్ తదితరులు నేతల్ని కలిసిన వారిలో ఉన్నారు. ఇదిలా ఉంటే తమ విజయంలో ఉద్యోగుల పాత్రే కీలకమైందంటూనే ప్రభుత్వ ఉద్యోగులకు తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని వారికి ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారు.

# జిల్లా అధికారుల్లో బదిలీల గుబులు

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు విశాఖలోనే ఉన్నారు. ఇక్కడ ఉన్న వారంతా దాదాపు ఏళ్ల తరబడి ఉంటున్న వారేనని చెప్పుకుంటున్నారు. పైగా విశాఖలోనే సేవలందిస్తున్న ముఖ్యమైన అధికారులపై టీడీపీ నేతలు గుర్రుగా ఉన్నారు. తమను లక్ష్యంగా చేసుకుని ఇన్నేళ్లు రాజ్యం ఏలిన వీరిపై ఒంటి కాలిపై లేస్తున్నారు. అందుకే వీరందరినీ సాగనంపాలని కూటమి నేతలు గట్టి పట్టుదలతో ఉన్నారు. వైసీపీ నేతల అడుగులకు మడుగులెత్తిన ఇక్కడి అధికారులను ఎంత త్వరగా అయితే అంత త్వరగానే జిల్లాలను దాటించాలని ప్రయత్నిస్తున్నారు. ఈ జాడ ముందుగానే పసిగట్టిన జిల్లా అధికారులు అందుకు సిద్ధంగానే ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. విశాఖ కలెక్టర్‌గా ఎ.మల్లికార్జున వచ్చి దాదాపు 3 ఏళ్లు కావస్తోంది. కలెక్టర్‌గా ఉంటూనే అదనంగా వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా కొనసాగుతున్నారు. తనకు బదిలీ తప్పదని కలెక్టర్ భావిస్తున్నారు. ప్రభుత్వం మారడం, తాను వచ్చి 3 ఏళ్ల సర్వీసు దాదాపు ముగుస్తుండడంతో బదిలీ అయితే వెళ్లిపోయేందుకు ఆయన సిద్ధంగా ఉన్నారని ప్రచారం జరుగుతోంది. అలాగే జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ కూడా జిల్లాకు వచ్చి 2 ఏళ్లు దాటుతోంది. అదనపు కమిషనర్ విశ్వనాథన్ జీవీఎంసీకు వెళ్లి మూడు నెలలవుతోంది. అంతకుముందు ఆయన జేసీగా సేవలందించారు. ప్రస్తుత జేసీ విజయనగరం జిల్లా నుంచి మూడు నెలల క్రితమే వచ్చారు. జిల్లాలో కీలకమైన ఇద్దరు ఆర్డీఓలు వచ్చి రెండేళ్లు కావస్తోంది. జీవీఎంసీలో పనిచేస్తున్న జోనల్ కమిషనర్లలో మెజార్టీ శాతం మంది వచ్చి రెండేళ్లకు పైగా సేవలందిస్తున్నారు. జెడ్పీ సీఈఓతో పాటు ఇతర శాఖలకు చెందిన జిల్లా అధికారులు ఏళ్ల తరబడి విశాఖలో పని చేస్తున్నారు. జిల్లాల పునర్విభజన సమయంలో సీనియార్టీ ప్రాతిపదికన ప్రస్తుత జిల్లా అధికారుల్లో ఎక్కువ మందిని విశాఖలో కొనసాగించారు. ఎలాగు ప్రభుత్వం మారినందున కీలక అధికారులతో పాటు జిల్లా అధికారుల బదిలీలు తప్పవని భావిస్తున్నారు. పోలీసు కమిషనర్‌తో పాటు పలువురు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లను మార్చాలని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. ఆయా అంశాలను పరిగణలోకి తీసుకుంటే పోలీసు శాఖలో భారీగా మార్పులు ఉండే అవకాశం ఉంది.

# మలేరియా విజృంభిస్తున్నా పట్టింపు లేదా?

(మొదటి పేజీ తరువాయి)

గజపతినగరం తరలించాల్సి వస్తోందని, సీరియస్ అయితే విశాఖలోని కేజీహెచ్‌కు వెళ్లాల్సి వస్తోందని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది ఐదుగురు గిరిజనులకు జ్వరాలొస్తే తొలుత విజయనగరం పెద్దాస్పత్రికి, తరువాత కేజీహెచ్‌లో చేర్పించాల్సి వచ్చిందని గుర్తు చేశారు. నెలపాటు కేజీహెచ్‌లో వైద్యం పొందాల్సి వచ్చిందని, రక్తహీనత వల్లే వీరంతా ఇబ్బంది పడ్డారని, దీంతో స్వచ్ఛంద సంస్థల సాయంతో చికిత్స చేయించామన్నారు. కేజీహెచ్‌లోని ఎస్టీ సెల్ విభాగం కొంత రక్తం సమకూర్చారని, ఏటా ఏప్రిల్, మే, జూన్ నెలలలొచ్చాయంటే ఆయా గ్రామాల వాసులు బెంబేలెత్తిపోవాల్సి వస్తోంది.

**ఆర్థికంగానూ ఇబ్బందులే**

వాస్తవానికి ఈ సమయం వచ్చిందంటే గిరిజనులంతా పోడు వ్యవసాయానికి వెళ్లిపోవాల్సి వస్తుంది. ఇలాంటి సమయంలో జ్వరాలొస్తే వారికి ఆర్థికంగానూ ఇబ్బందులు తప్పవు. ఇటీవల గుమ్మ కోటకు చెందిన ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్ వచ్చి సేవలందించారు. మలేరియా సోకితే ఇటుక బట్టీ వ్యాపారస్తులు వద్ద అప్పు తీసుకొని వైద్యం పొందుతుంటారు. అప్పు తీర్చడం కోసం డిసెంబర్‌లో కొల్లూరు వంటి ఇతర ప్రాంతాలకు వలస పోయి సొమ్ము సంపాదించాల్సి వస్తోంది.

**బురదనీరే గతి**

ఆరోగ్యం మాట అలా ఉంచితే స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు దాటుతున్నా ఇక్కడి వారంతా చీకట్లలోనే మగ్గుతున్నారు. విద్యుత్ సరఫరా కల్పించాలని కోరుతున్నారు. జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా బోరు తవ్వినా మోటార్ అమర్చకపోవడంతో ఇప్పటికీ బురద నీటినే తాగిల్సి వస్తోంది. జిల్లా కలెక్టర్ చొరవ చూపించి తమకు బతుకులు కల్పించాలని బద్నేని బుజ్జిబాబు, కోనపర్తి సింహాచలం, బూరుగ పెంటయ్య తదితరులు వేడుకున్నారు.

**వైద్య శిబిరాలేర్పాటు చేయాలి**

తమ ప్రాంతాల్లో తక్షణమే వైద్య శిబిరాలేర్పాటు చేయాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. ఇతర రోగాల వలే మలేరియాను కూడా రికార్డుల్లో నమోదు చేయించాలని, కొంతమంది సిబ్బంది ఇక్కడి పరిస్థితిని నివేదిస్తున్నా జిల్లా ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని గిరిజన సంఘం అధ్యక్షులు సివేరి కొండలరావు, సీపీఎం ల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు ఆరోపించారు.

# సిక్కోల్ ప్రజలందరికీ పాదాభివందనం

**- జిల్లా ప్రజల అభిమానమేకేంద్రమంత్రి పదవి**

**: కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు**



**నరసన్నపేట, జూన్ 9, మేజర్‌న్యూస్:** శ్రీకాకుళం జిల్లా ప్రజల అభిమానము ఆదరణ వల్లే కేంద్ర మంత్రిగా అవకాశంలభించిందని, జిల్లా ప్రజల రుణం తీర్చుకోలేనిదని, ఇంతటి అవకాశానికి కారకులైన శ్రీకాకుళం జిల్లా ప్రజలందరికీ పాదాభివందనాలు చేస్తున్నానని శ్రీకాకుళం జిల్లా ఎంపీ, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఒక ప్రకటనలో తెలియ జేశారు. ప్రధాని నరేంద్ర మోడీ, తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, తెలుగుదేశం రాష్ట్ర పార్టీ అధ్యక్షులు చిన్నాన్న కింజరాపు అచ్చం నాయుడు, తన తల్లి, భార్య ఇతర కుటుంబ సభ్యులు అన్నివేళ లా అండదండలతో తనకు సహక రించడం వల్లే ఈరోజు కేంద్రమం త్రి అవ్వగలిగామని, శ్రీకాకుళం జిల్లా ప్రజలుమూడవసారి అఖండ మెజారిటీతో గెలిపించి కేంద్ర మంత్రిగా అవకాశం కల్పించారని వీరందరికీ ధన్యవాదాలు తెలియ జేస్తూ, రాష్ట్ర ప్రయోజ నాలు దృష్టిలో పెట్టుకుని, రాష్ట్ర అభివృద్ధి కి అవసరమైన పనులు నిర్వహిం చడంలో కేంద్ర ప్రభుత్వ సహకారం తో, ప్రజలందరూ ఆశయాలను ఆశలను నిలబెట్టేందుకు కృషి చేస్తానని, నరేంద్ర మోడీ నాయక త్వంలోని ఎన్ డి ఏ కూటమి కిఅధి కారం కట్టబెట్టిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ, రాష్ట్రం లో కేంద్రం లో ప్రజలు అఖండ మెజారిటీతో ఇచ్చిన విక్టరీ గెలుపును వమ్ము చేయకుండా దేశ రాష్ట్ర ప్రగతికికృషి చేస్తానని, కేంద్ర మంత్రిగా రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తానని రామ్మోహన్ నాయుడు అన్నారు. అధికారంలోకి వచ్చేందుకు ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీలన్నిటిని అమలుపరిచి ప్రజలందరి మన్ననలను పొందేందుకు ప్రయత్నం చేస్తామని, సంక్షేమ అభివృద్ధిలో ముందుకు సాగేందుకు కృషి చేస్తామని కేంద్ర మంత్రి జిల్లా ప్రజలకు ఒక ప్రకటనలో హామీ ఇచ్చారు.

# జేయింట్ వీల్ ఎగ్జిబిషన్

**పాడేరు, జూన్ 9, మేజర్‌న్యూస్:** పాడేరు శ్రీ మోద కొండమ్మ జాతర సందర్భంగా పాడేరు జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన జేయింట్ వీల్ ఎగ్జిబిషన్ ను పాడేరు ఎమ్మెల్యే మత్యరాస విశ్వేశ్వరరాజు, తాజా మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ఆదివారం సాయంత్రం ప్రారంభించారు.అనంతరం జాయింట్ వీల్‌ను ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, తాజా మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఆలయకమిటి ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలం నాయుడు, ఉత్సవ అధ్యక్షులు కొట్టగుల్లి రామారావు,ప్రధాన కార్యదర్శి శ్రీనీవాస్, వెంకటరమణ, ప్రసాద నాయుడు,వైసిపి నాయకులు కూడా సురేష్, నరసింహనాయుడు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు జాయిన్ వీల్ ఎక్కి సందడి చేసారు.ఈ కార్యక్రమంలో అలా కమిటీ, ఉత్సవ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

# నాడు తండ్రి.. నేడు తనయుడు

(మొదటి పేజీ తరువాయి)

భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు రామ్మోహన్ అనేక కార్యక్రమాల్ని నిర్వహించారు. పదేళ్లగా ఆయన తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో యువతకు ప్రత్యక్ష ఇంటర్న్‌షిప్‌లు నిర్వహించారు. 175 మందికి పైగా ఆయనతో వర్చువల్/క్షేత్రస్థాయిలో పరిచయం కలిగి ఉన్నారు. స్పీకర్‌తో యువ ఎంపీల సమావేశాల్ని కూడా రామ్మోహన్ ప్రారంభించారు. పార్లమెంటులో యువ ఎంపీల్ని ప్రోత్సహించడం, శిక్షణా సమావేశాలు నిర్వహించడంపై చర్చల్ని కూడా ఆయన ప్రోత్సహించారు.

# 14వ తారీఖున నూతన ప్రభుత్వం మద్యం ఉత్తర్వులు



**పలాస/మందస, జూన్ 9, మేజర్‌న్యూస్:** మద్యం పాలసీపై వాడి వేడి చర్చ తుది నిర్ణయం కోసం ఈనెల 14వ తారీఖున ప్రభుత్వ ఉత్తర్వులు ప్రస్తుతం ఉన్న మద్యం పాలసీని రద్దు చేస్తున్న నూతన ప్రభుత్వం కొత్త పాలసీని ముందుకు తేనుంది ఇప్పుడున్న డిస్టలరీస్ అన్నిటి లైసెన్సులను రద్దు చేయనుంది రాష్ట్రంలో ఉన్న 3600 మద్యం దుకాణాలకు టెండర్ సిస్టం ద్వారా ఇవ్వనున్నారు టెండర్ విధానంలో రూరల్ ప్రాంతంలో ఒక షాప్ కి 45000గా అర్బన్ ఏరియాలో 55000 రూపాయలు డిపాజిట్ చేసే విధంగా కట్టిన పైకము తిరిగి చెల్లించరు కల్తీ లేని మద్యాన్ని తిరిగి పాత బ్రాండ్లను వినియోగదారుడికి అందించే విధంగా మార్పులు గత ప్రభుత్వంలో ఊరు పేరు లేని డిస్టలరీస్ కు పర్మిషన్ ఇవ్వడంతో ఇష్టారాజ్యంగా దోపిడీ చేసిన జగన్ ప్రభుత్వం దీనిపై ఎంక్వయిరీ కూడా వెయ్యడం జరుగుతుంది తెలియజేయడం జరిగినది. జరుగుతుంది తెలియజేయడం జరిగినది.

# వైసీపీలో 'లక్కీ' గొల్ల బాబూరావు

(మొదటి పేజీ తరువాయి)

బాబూరావు పోటీ చేసి ఉన్నా కూటమి అభ్యర్థులు గాల్లో కొట్టుకుపోయి ఉండేవారు. అయితే స్థానిక నాయకుడిగా ఉత్తరాంధ్రలో వైసీపీకి ఏకైక రాజ్యసభ సభ్యుడిగా బాబూరావు మిగిలిపోయారు. అంతేకాదు ఉత్తరాంధ్ర వైసీపీ అదృష్టవంతుడు ఎవరంటే బాబూరావు ఒక్కరేనని టక్కున సమాధానం వస్తోంది.

## కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేసిన రాకేష్ రెడ్డి, పద్మశ్రీలను వెంటనే సస్పెండ్ చేయాలి

**పిసిసి జనరల్ సెక్రటరీ జగత శ్రీనివాస్**



**పాయకరావుపేట, జూన్ 9, మేజర్‌న్యూస్:** కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేసిన రాకేష్ రెడ్డి,పద్మశ్రీ లను వెంటనే సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ పిసిసి జనరల్ సెక్రటరీ జగతా శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ రాకేష్ రెడ్డి, పద్మశ్రీలు వీరిద్దరూ తిన్న ఇంటి వాసాలు లెక్క పెట్టే విధంగా పనిచేశారని, ఎంతో కష్టపడి, మండుతున్న ఎండలు సైతం లెక్కచేయకుండా రాష్ట్రం మొత్తం తిరిగి కాంగ్రెస్ పార్టీ కి ఊపిరి పోసిన పిసిసి అధ్యక్షురాలు షర్మిలమ్మ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వీరిద్దరినీ తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, ఆదివారం పాయకరావుపేట విలేకరుల సమావేశంలో,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ జగత శ్రీనివాస్ డిమాండ్ చేశారు.బలమైన ప్రతిపక్ష పార్టీలు నాయకులే జగన్ ని విమర్శించడానికి భయపడే పరిస్తితులలో షర్మిలమ్మ జగన్ మోహన్ రెడ్డి ని ఏకిపారేసారని తెలిపారు.అలాంటి ధైర్యశాలి షర్మిలమ్మని వారి స్వలాభం కోసం నిందలు వేసిన రాకేష్ రెడ్డి,పద్మశ్రీ లను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.వారిద్దరూ కాంగ్రెస్ పార్టీ లో కొనసాగే అర్హత కోల్పోయారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి మండలం పార్టీ అధ్యక్షులు ప్రగడ చక్ర రావు,పట్టణ అధ్య క్షులు పోలవరపు అప్పలరాజు,నాయకులు బర్రె జగన్నాథం పార్టీ కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అచ్చంనాయుడును కలిసిన ఎంఎల్ఏ జగదీశ్వరి



**గరుగుబిల్లి, జూన్ 9, మేజర్‌న్యూస్:** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు టెక్కలి నియోజకవర్గం శాసన సభ్యులు కింజరాపు అచ్చం నాయుడును కురుపాం నియోజక వర్గం శాసనసభ్యులు తోయక జగదీశ్వరి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే జగదీశ్వరితో పాటు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు మఱ్రాపు పురుషోత్తంనాయుడు, డొంకాడ రామకృష్ణ, పొట్నూరు వెంకటనాయుడు, బొత్స జగదీష్, రౌతు గోవిందనాయుడు, తది తరులు అచ్చంనాయుడుకు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కురుపాం నియోజకవర్గం శాసనసభ్యులుగా ఘన విజయం సాధించిన తోయక జగదీశ్వరి రాష్ట్ర తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు కింజరాపు అచ్చం నాయుడుకు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కురుపాం నియోజకవర్గం శాసనసభ్య లుగా ఘన విజయం సాధించిన తోయక జగదీశ్వరికి ఈసందర్భం గా అచ్చం నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు మఱ్రాపు పురుషోత్తంనాయుడు, అరకు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, మండల తెలుగు యువత అధ్యక్షులు బొత్స జగదీష్ , రౌతు గోవిందనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## కళావెంకటరావును కలిసిన ఎంఎల్ఏ జగదీశ్వరి



**గరుగుబిల్లి, జూన్ 9, మేజర్‌న్యూస్:** ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో చీపురుపల్లి నియోజక వర్గం శాసనసభ్యులుగా ఎన్నికైన కిమిడి కళావెంకట రావును కురుపాం నియోజకవర్గం శాసన సభ్యులు తోయక జగదీశ్వరితో పాటు పలువురు టిడిపి నాయకులు ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలియజే శారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగదీశ్వరితో పాటు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు మఱ్రాపు పురుషోత్తంనాయుడు, అరకు పార్లమెంట్ తెలుగుదే శం పార్టీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, మండల తెలుగుయువత అధ్యక్షులు బొత్స జగదీష్, తదితరులు ఎమ్మెల్యే కళా వెంకటరావుకు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియ జేశారు. ఆదివాసి గిరిజన కుటుంబానికి చెందిన తోయక జగదీశ్వరి శాసన సభ్యులుగా అత్యధిక మెజారిటీతో గెలుపొంద డం పట్ల కళావెంకటరావు ఈ సందర్భంగా జగదీశ్వరిని అభినందించారు. ఈకార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు బొత్స జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సుదర్శనహోమంలు

**- ప్రముఖ యజ్ఞ,యాగకర్త ఎస్ వి ఎల్ ఎన్ శర్మ యాజి పర్యవేక్షణలో కార్యక్రమం**

**- పాల్గొన్న పలుప్రాంతాలకు చెందిన భక్తులు**



**గరుగుబిల్లి, జూన్ 9, మేజర్‌న్యూస్:** మండల కేంద్రంలోని శ్రీషిరిడి సాయిబాబా ఆలయంలో ఆదివారం సుదర్శన హెూమములు కార్యక్రమమును ఘనంగా నిర్వ హించారు. ఈసందర్భంగా పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని సుదర్శన హెూమములు జరిపించుకున్నారు. ఈమేరకు ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, అభిషేకములు, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సుదర్శన హెూమములు కార్యక్ర మంను వీరఘట్టంకు చెందిన ప్రముఖ యజ్ఞ యాగకర్త, అసంఖ్యా క దేవాలయాల ప్రతిష్టాపకులు ఎస్ వి ఎల్ ఎన్ శర్మయాజి సంపూర్ణ సహాయ సహకారాలతో రుత్వికులు సత్తె నరసింహాచార్యులు సుదర్శన హెూమంలు కార్యక్రమమును నిర్వహించడం జరిగిందని కమిటీ సభ్యులు తెలిపారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు హెూమము కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ఉచిత ప్రసాదమును అందజేశారు.

## కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర మంత్రి గొప్ప చరిత్ర



**పలాస/మందస, జూన్ 9, మేజర్‌న్యూస్:** శ్రీకాకుళం జిల్లా అతి చిన్ వయస్సులోనే శ్రీకాకుళం జిల్లా తెలుగుదేశం పార్టీ ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేయి సందర్భంగా ఆయనకు పలాస నియోజకవర్గం ప్రజానీకం మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేస్తూ నియో జకవర్గం పరిధిలో సంబరాలు చేసుకుంటున్నాడు శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి అంటే చూపించే నాయకుడు రామ్మోహన్ అని పలాస నియోజకవర్గానికి కొన్ని హామీలు ఇచ్చినవి ఇప్పుడు నెరబోతుంది అని ప్రజానీకంలో ఆనందంలు.

## కేంద్ర మంత్రివర్గంలో కూటమి ఎంపీలు ముగ్గురికి మంత్రులుగా చోటు దక్కడం హర్షనీయం

**మాడుగుల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు: పైలా ప్రసాద్ రావు**



**కే కోటపాడు, జూన్ 9, మేజర్‌న్యూస్:** కేంద్ర మంత్రి వర్గంలో రాష్ట్రానికి చెందిన కూటమి యువకిశోరాలయిన టీడీపీకి చెందిన ఇద్దరు పార్లమెంట్ సభ్యు లకు, అలాగే మిత్రపక్షమైన బీజేపీ నరసాపురం ఎం.పి.కి మంత్రులుగా చోటు దక్కడం హర్షణీయం అని తెలుగుదేశం పార్టీ మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం ఎంపి కింజరాపు రామ్మో హన్ నాయుడు కి కాబినెట్ మంత్రిగా, గుంటూరు ఎంపి పెమ్మసాని చంద్రశేఖర్ కి సహాయ మంత్రిగా, అలాగే శ్రీనివాస వర్మ కి మంత్రిగా అవకాశం రావడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి శ్రీకారం అని పైలా అన్నారు. కేంద్రమంత్రిగా సీనియర్ ఎంపి రామ్మోహన్ నాయుడు ,ఎన్నికైన తొలిసారే సహాయ మంత్రి కానున్న చంద్రశేఖర్,అలాగే మరో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ ఆధ్వర్యంలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందనుందని అయన అకాంక్షించారు.కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయనున్న టీడీపీ ఎంపీలు రామ్మోహన్ నాయుడు కి, చంద్రశేఖర్ కి,బీజేపీ ఎంపి శ్రీనివాస వర్మ కి పైలా అభినందనలు తెలిపారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందన్నారు. రామ్మోహన్ నాయుడు మామగారైన బండారు సత్యనారాయణ మూర్తి ప్రాతినిధ్యం వహిస్తున్న మాడుగుల నియోజకవర్గం కూడా అన్నిరంగాల్లో అభివృద్ధి చెందడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఈ అవకాశం కల్పించిన ప్రధాని నరేంద్ర మోడీ కి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కి, జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్‌కి మాడుగుల టీడీపీ నేత పైలా ప్రసాదరావు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజలకు సేవ చేయడం తప్ప కుల్లి రాజకీయాలు తెలియవు

**ఆత్మీయ సమావేశంలో మాజీ ఎంపీపీ గోపిబాబు**




**పద్మనాభం, జూన్ 9, మేజర్‌న్యూస్:** మండల ప్రజలకు నిస్వార్థంగా, నిజాయితీగా నిరంతరం సేవ చేయడమే తప్ప, కుల్లి,కుతంత్ర రాజకీయాలు తమకు తెలియవని మాజీ ఎంపీపీ దంతులూరి గోపిబాబు అన్నారు. ఆదివారం అనంతవరం, పెంట, కొవ్వాడ, గందవరం గ్రామాల టీడీపీ నాయకులు కొవ్వాడ సమీపంలో ఉన్న మామిడి తోటలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ తాతల నుండి కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పటికీ, తరువాత జగన్ సమక్షంలో వైసీపీలో చేరారని అన్నారు. అయితే గతంలో తమ సహాయంతో కర్రి సీతారాం, అవంతి శ్రీనివాసరావు గెలిచిన తరువాత తమను ఎన్నో విదాలుగా ఇబ్బందులు పెట్టడంతో ఇటీవల టీడీపీలో చేరారని ఆయన స్పష్టం చేసారు. నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయడం తప్ప రాజకీయం చేసి ఏనాడూ ఒక రూపాయి సంపాదించుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుకేనేమో తమతో పాటు మండలంలో కొందరు నాయకులు గోపిబాబే ముఖ్యమని, పార్టీలి కాదని టీడీపీలో చేరి గంటా శ్రీనివాసరావు గెలుపునకు విశేషమైన కృషిచేసారని ఆయన అన్నారు. గతంలో తమకు జరిగిన అన్యాయం వల్ల కొని సంవత్సరాలు రాజకీయాలకు దూరంగా ఉన్నారని, ప్రస్తుతం గంటా శ్రీనివాసరావు అందరికీ అందుబాటులో ఉంటారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా గోపిబాబును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వామినాయుడు, చంద్రరావు, గణేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యక్తిపై విచక్షణా రహితంగా చాకుతో దాడి

**- పర్సు,సెల్ ఫోన్ దొంగిలించకపోయిన గుర్తు తెలియని వ్యక్తులు**

**- అపస్మారక స్థితిలో క్షతగాత్రుడు**

**- గుర్తు తెలియని వ్యక్తులపై పోలీసులు ఆరా**



**దేవరాపల్లి, జూన్ 9, మేజర్‌న్యూస్:** గమ్యానికి చేర్చమన్న వ్యక్తిపై చాకుతో విచక్షణా రహితంగా దాడి చేసి అతని వద్ద నగదుని, సెల్ ఫోన్ నిగుర్తు తెలియని ఇద్దరు యువకులు దొంగిలించుకు పోయా రు. దేవరాపల్లి సమీపంలోని వంతెన వద్ద ఆదివారం తెల్లవారిఝుమున 3 గంటల ప్రాంతంలో జరిగిన ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. గుర్తు తెలియని యువకుల చేతిలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడు ప్రస్తుతం కె.కోటపాడు సీహెచ్సీలో చికిత్స పొందుతున్నాడు.దీనికి సంబందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం వెంకటరమణపేటకు చెందిన జవ్వాది శ్రీను (32) విశాఖ నుంచి దేవరాపల్లిలోని తన అత్తవారింటికి శనివారం రాత్రి బయలుదేరాడు. కొత్తవలస వరకు బస్సులోనూ, అక్కడ నుంచి వావిలపాడు. జంక్షన్ వరకు క్వారీ లారీ మీద చేరుకున్నాడు. అక్కడ నుంచి ఏ వాహనం దొరక్కపోవడంతో దేవరాపల్లికి నడుచుకుంటూ బయలుదేరాడు.మార్గమధ్యలో ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై దేవరాపల్లి వైపు వస్తుండగా వారిని ఆపి దేవరాపల్లి వరకు తీసుకెళ్లాలని కోరాడు. అతడిని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకున్న యువకులు దేవరాపల్లిలో దించకుండా ఊరుదాటిన తరువాత శారదానది వంతెన మీదకు నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకొచ్చి దించారు. అతని జేబులో ఉన్న పర్సుని ఇచ్చి సెల్ ఫోన్ ఇవ్వడానికి నిరాకరించాడు. దీంతో రెచ్చిపోయిన యువకులిద్దరు అతనిపై చాకుతో దాడికి దిగారు. ఈ దాడిలో శ్రీను చేతి వేళ్లు, తలతోపాటు శరీరంలో పలుచోట్ల విచక్షణా రహితంగా పలుచోట్ల చాకుతో తీవ్రంగా గాయపర్చడంతో సెల్ఫోను వారికిచ్చేసి ప్రాణభయంలో పరుగులు తీశాడు. అయినా అతడినియువకులిద్దరు వెంబడించడంతో వంతెనకు దగ్గరలో ఉన్న ఇటుకబట్టీల వద్దకు చేరుకొని పెద్దగా కేకలు వెయ్యడంతో వారంతా నిద్రలేచి చూసేసరికి దాడికి పాల్పడినయువకులిద్దరు పరారీ అయ్యారు. తీవ్రంగా గాయపడిన శ్రీనుని దేవరాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసంకె.కోటపాడు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐడి. నాగేంద్ర మాట్లాడుతూ చాకుతో దాడికి పాల్పడిన ఘటనపై కేసు నమోదు చేశామన్నారు. క్షతగాత్రుడు శ్రీను వద్ద నుంచి నగదు, సెల్ఫోను దొంగిలించడానికే అతనిపై గుర్తుతెలియని వక్తులు చాకుతో దాడికి పాల్పడి ఉంటారని భావిస్తున్నామన్నారు. దాడి చేసిన వ్యక్తులపై ఆరా తీస్తున్నామన్నారు.

### ఈనాడు గ్రూప్ ఆఫ్ సంస్థల చైర్మన్
## రామోజీరావు గారి సంతాప సభ



**తగరపువలస, జూన్ 9, మేజర్‌న్యూస్:** స్థానిక తగరపువలస జీవీఎంసీ ఫస్ట్ వార్డ్ అధ్యక్షులు తమ్మిన సూరిబాబు భీమిలి మున్సిపల్ ఎక్స్ చైర్మన్ కొప్పల ప్రభాకర్ రమేష్ ఆధ్వర్యంలో ఈనాడు గ్రూప్ సంస్థ చైర్మన్ రామోజీరావుకి సంతాపం తెలియజేయడం జరిగింది. కొప్పల రమేష్ మాట్లాడుతూ రామోజీ మరణించడం రెండు తెలుగు రాష్ట్రాలకే కాక యావత్తు భారతదేశానికి తీరని లోటు అన్నారు. తమ్మిన సూరిబాబు సమస్యల పరిష్కారించడంలో ఈనాడు పత్రిక ముందున్నది రామోజీరావు మరణించడం రెండు తెలుగు రాష్ట్రాల కే కాక తెలుగు దేశం పార్టీ కూడా తీరని లోటు ఆయన ఆత్మ శాంతించాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నాను. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు, టైలర్ సంఘం ప్రతినిధులు పాల్గొని నివాళులర్పించారు.

### జై జవాన్ అరికట్టాలీ అవినీతిపై
## ఉత్తరాంధ్ర వీర సైనికులు విస్తృత సమావేశం



**భీమునిపట్నం, జూన్ 9, మేజర్‌న్యూస్:** మండలంలో గుడివాడ శ్రీ హనుమాన్ జంక్షన్ ప్రాంగణంలో విస్తృత చర్చ ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి అనేక విషయాలు చర్చించాము. అందులో భాగంగా రియల్ ఎస్టేట్ వ్యాపారి కారం పూడి కృష్ణమూర్తిపై యుద్ధ ప్రాతిపదికన ముందుకు వెళ్దాం అనీ, అలానే కొత్తూరు మండలం, అంగూరు గ్రామ నివాసి పతివాడ బాబురావు భార్య స్వాతి ప్రాణహాని ఉందంటూ మన మాజీ సైనికులు సుబ్రహ్మణ్యంకి చెప్పటం తో ఆయన సంరక్షణ లో మే 26న తగరపువలసలో తాత్కాలికంగా ఉంచి.. శ్రీకాకుళం వెళ్లి తిరిగి అదే రోజు రాత్రి సుమారు 12 గంటల ప్రాంతంలో తగరపువలస రాగా ఆమెను మంచిగా చూసుకొంటాం అని వచ్చిన 8మంది వారి కుటుంబ సభ్యులును చూసి ఆమె ఎటో పరారీ అయినది. అప్పటి నుంచి వెతుకుతూ ఉన్నారు. ఆమె ఫోటో ఆధారంగా ఎవరైనా 9866630216 కి తెలియ జేసిన యెడల పారితోషకం ఇవ్వ బడును అనీ, ఇక కొత్తవలస రిటైర్డ్ సైనికులు పి. సన్యాసిరావు భార్య మిస్ అయినది అనీ అచ్చట పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయగా రశీదు ఇవ్వలేదు. అని చెప్పటంతో వెళ్లి అడుగుగా తప్పుడు కేసులు పెట్టేటట్టు అచ్చట రైటరు యువరాజ్ ధోరణి ఉండటంతో మరునాడు (జూన్ 2న) ఒక స్క్వాడ్ వీర సైనికులుమి స్టేషన్ కి వెళ్లి సన్యాసిరావు యొక్క లెటర్ ఇచ్చి ఆ భార్యాభర్తలను కలపాలనీ లేదంటే రశీదు ఇవ్వాలని సూచించాం. ఒకవేళ అన్యధా ప్రవర్తిస్తే ఉత్తరాంధ్ర వీర సైనికులు కొత్తవలస పోలీస్ స్టేషన్ కి వెళ్లుటకు సిద్ధంగా ఉండాలని పిలుపునిస్తూ చిల్ల వెంకట రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు.

## బీచ్‌లో బాలికను కాపాడిన లైఫ్ గార్డులు



**విశాఖపట్నం, జూన్ 9, మేజర్‌న్యూస్:** విశాఖపట్నం ఆర్కే బీచ్ లో మునిగిపోతున్న బాలికను జీవీఎంసీ లైఫ్ గార్డులు రక్షించారని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయి కాంత్ వర్మ ఆదివారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. జీవీఎంసీ పరిధిలోని రామ నగరకు చెందిన సుధా అనే 16 సంవత్సరాల బాలిక ఆర్కే బీచ్ లో ఆటవిడుపుగా స్నానానికి దిగి అలల తాకిడికి లోపలికి వెళ్ళిపోతున్న బాలికను గమనించిన జీవీఎంసీ లైఫ్ గార్డులు ఆనంద్, వాసు, అచ్చన్న లు రక్షించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారని తెలిపారు. విశాఖ నగరానికి సందర్శకులు, విహారయాత్రికులు, నగర ప్రజలు విశాఖ తీర అందాలను తిలకించేందుకు నిత్యం సముద్రతీరానికి వస్తూ ఉంటారని, సముద్రంలో ప్రమాదాలకు గురికాకూడదని జీవీఎంసీ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ సందర్శకులు బీచ్ లలో స్నానానికి దిగి లోతట్టు ప్రాంతాలకు వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారని , ఎవరూ కూడా సముద్ర తీర ప్రాంతం వెంబడి బీచ్ లలో స్నానాలకు వెళ్ళి తమ ప్రాణాలకు అపాయం కలిగించుకోరాదని కమిషనర్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## ఏపీలో వేసవి సెలవులు పొడిగింపు

**నరసన్నపేట, జూన్ 9, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో వేసవి సెలవులను ఈనెల 12 వరకు పొడిగిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం 12న పాఠశాలలు పున:ప్రారంభం కావాల్సి ఉండగా 13న రీఓపెన్ అవుతాయని వెల్లడించింది. 12న చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో ఆ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెసులుబాటు కల్పించాలని పలు ఉపాధ్యాయ సంఘాలు కోరాయి. సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం సెలవులను మరోరోజు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## పెదవలస యువతకి ఉత్తమ అచీవర్స్ అవార్డు
### -134 భాషల్లో వందేమాతరం తిరగా రాసినందుకు గుర్తింపు
### -జెడ్పీటిసి చేతులమీదుగా అవార్డు అందజేత



**జీకే.వీధి, జూన్ 9, మేజర్‌న్యూస్:** మంచి గుర్తింపు సాధించాలనే లక్ష్యంతో ప్రత్యేకమైన ప్రతిభతో అనేకమార్లు అవార్డులు అందుకోవడం అభినందనీయమని నర్సీపట్నం జడ్పీటిసి సభ్యురాలు రమణమ్మ అన్నారు. గూడెంకొత్తవీధి మండలం పెదవలస గ్రామానికి చెందిన మామిడి రమ్య తిరగరాతతో ప్రత్యేకమైన గుర్తింపు కనబరుస్తున్నారు. ఇప్పటికీ ఆమె 100 భాషల్లో వందేమాతరాన్ని తిరగరాసి అనేక అవార్డులు సొంతం చేసుకున్నారు. తాజాగా తన ప్రత్యేకమైన ప్రతిభను చాటుతూ 134 భాషలలో వందేమాతరాన్ని తిరిగ రాసి ఉత్తమ అచీవార్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆన్లైన్ ద్వారా వచ్చిన అవార్డును ఆదివారం నర్సీపట్నం జడ్పీటిసి సభ్యురాలు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతానికి చెందిన రమ్య వందేమాతరం గీతాన్ని ప్రపంచ భాషల్లో తిరగరాస్తూ ప్రత్యేక గుర్తింపు తీసుకురావడం అభినందనీయమని ఆమెను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అవార్డు అందుకున్న మీరు మాట్లాడుతూ తిరగ రాయడం ద్వారా అవార్డులు వస్తున్న అవార్డులను తీసుకునేందుకు ఇతర దేశాలకు వెళ్లేందుకు ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నాయని అందుకే ఆన్లైన్ ద్వారా తీసుకోవాల్సి వస్తుందన్నారు. ఆర్థికంగా ప్రోత్సహిస్తే మరింత గుర్తింపు తీసుకు వస్తానని ఈ బెస్ట్ అచీవర్స్ అవార్డ్ వైద్యుడు లక్ష్మీ నాయక్, ఏలూరు డిడి గోవిందరాజు సహకారంతో తీసుకోవడం జరిగిందని గుర్తించి సహకరిస్తే మన్యానికి మంచి పేరు తీసుకు వస్తానని ఆమె అన్నారు.

# పద్మశాలీ డైరెక్టర్ పదవికి రాజీనామా



**భీమునిపట్నం, జూన్ 9, మేజర్‌న్యూస్:** సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఓటమి చెందడం తో మాజీ మంత్రి వర్యులు ముత్తంశెట్టి, శ్రీనివాసరావు సిఫారసుతో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ద్వారా నియమితులైన, ఆంధ్ర ప్రదేశ్ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మిన,రామలక్ష్మణ రావు ఆ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ఆంధ్ర ప్రదేశ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కి పంపినట్లు తెలియ జేశారు. ఈ సందర్భంగా రామలక్ష్మణ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి గా వై.ఎస్.జగన్మోహన రెడ్డి బీసీ,కార్పొరేషన్లు నియమించి వారిలో ఆత్మ గౌరవాన్ని కల్పించిన నిధులు, విధులు ఏర్పాటు చేయకపోవడం తో ఆ యా సామాజిక వర్గాలు పార్టీకి, ప్రభుత్వానికి దగ్గర కాలేకపోయాయని తెలిపారు. డైరెక్టర్ పదవి నాకు వచ్చిన తరువాత నా పై నా సామాజిక వర్గీయులు ఏదో చేస్తానని ఎంతోఆశించారని కాని వారి ఆశలకు అనుగుణంగా ఉపయోగ పడలేక పోయానని అన్నారు. ప్రభు త్వము మారినందున నైతిక బాధ్యతతో గత ప్రభుత్వం ద్వారా లభించిన డైరెక్టర్ పదవికి నా రాజీనామా ను పంపిస్తున్నాన్ని తమ్మిన,రామలక్ష్మణ రావు తెలిపారు.

### తాతలు వయస్సులో పూర్వ విద్యార్థులు
# అపూర్వ కలయిక 1980 10వ తరగతి విద్యార్థులు



**సాలూరు, జూన్ 9, మేజర్‌న్యూస్:** 1980 సంవత్సరం 10వ తరగతి చదివిన విద్యార్థిని విద్యార్థులు కుటుంబాలతో సాలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం అపూర్వ కలయిక జరిగింది ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఉద్యోగాల్లో స్థిరపడి అంతమంది కుటుంబ సభ్యులతో తమ చదువుకున్న పాఠశాలలో చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు నాగేశ్వరరావు బాగున్నావా రమేష్ బాగున్నావా స్నేహితులు పలకరించుకుంటూ ఒకరినొకరు ఆప్యాయతగా కరచారాలు చేస్తూ ఆనందముతో కలుసుకున్నారు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం వరకు పాఠశాల ఆవరణలో తన చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ చిన్నప్పుడు చేసిన అల్లర్లు జ్ఞాపకం తెచ్చుకొంటూ ఆనందముతో అపూర్వ కలయిక జరిగింది పిల్లలతో ఆటపాటలు సాంస్కృతిక కార్యక్రమాలు డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమాలు పిల్లలు ఉత్సాహంగా చేశారు అంతమంది సంతోషముతో ఉదయం నుండి సాయంత్రం వరకు కార్యక్రమాలు నిర్వహించారు సాఫ్ట్వేర్ రంగములో స్థిరపడిన అమెరికా నుండి చిన్ననాటి స్నేహితుడు కుటుంబ సభ్యులతో రావడం విశేషం ఐపీఎస్ స్థాయిలో ఉన్న ఒక మిత్రుడు రావడం చిన్ననాటి స్నేహితులు అభినందనలు తెలిపారు స్నేహానికి గుర్తుగా మిత్రులు రావడం అదృష్టం అని కొంతమంది మిత్రులు ఇద్దరు స్నేహితులను పలకరించుకుంటూ ఆనందంగా కాలం గడిపారు పూర్వ విద్యార్థులు పదవ తరగతి బ్యాచ్ చదువుకున్న కొంతమంది మిత్రులు లాయర్లు డాక్టర్లు ఉపాధ్యాయులు బ్యాంకు మేనేజర్లు రంగాల్లో స్థిరపడి ఉద్యోగాలు చేస్తూ కుటుంబ సభ్యులతో పూర్వ విద్యార్థులు ఆహ్వానాన్ని మన్నించి వచ్చారు మిత్రులు అంతమందిని ఆహ్వానం పలికిన బాలి విశ్వేశ్వరరావు గర్భపు నాగేశ్వరరావు టి రమేష్ సీనియర్ జర్నలిస్టులు మిత్రులు అంతమందిని ఫోన్ సమాచారం ద్వారా సేకరించి పూర్వ విద్యార్థులు అపూర్వ కలయిక జరిగింది కృషి చేసిన ముగ్గురు సీనియర్ జర్నలిస్టులకు వివిధ స్థాయిలో ఉన్న ఉద్యోగులు చిన్ననాటి స్నేహితులు వారిని అభినందించారు వారి దయవలన అంతమంది ఒక వేదిక వద్ద కలవడం అదృష్టం అని వారిని అభినందించారు.

# వైభవంగా ప్రారంభమైన అమ్మవారి జాతర

### - సతకం పట్టు వద్ద కొలువుదీరిన మోదమ్మ
### - అమ్మవారి జాతరకు పక్కా ఏర్పాట్లు
### - జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత



**పాడేరు, జూన్ 9, మేజర్‌న్యూస్:** శ్రీ శ్రీ శ్రీ మోదకొండమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు నిర్వహించనున్న అమ్మవారి జాతర అంగరంగ వైభంగా జరుగుతోంది. ఆదివారం జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత, ఐటిడి ఏ పి. ఓ వి. అభిషేక్, ఆలయకమిటి అధ్యక్షురాలు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి, పాడేరు శాసన సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు అమ్మవారి ఆలయం నుండి శతకం పట్టు వరకు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని, పాదాలను శతకం పట్టుకు డప్పువాయిద్యాలు, గిరిజన నృత్యాలు, గరగల ఆటలతో ఊరేగింపుగా తీసుకుని వచ్చి శతకం పట్టు వద్ద ప్రతిష్టించారు. భక్తుల దర్శనార్థం అమ్మవారు సతకం పట్టు వద్ద కొలువు దీరారు. భారీ ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఘటాల ఊరేగింపు కన్నుల పండవగా సాగింది. శతకం పట్టు వద్ద జిల్లా కలెక్టర్, ఐటిడి ఏ పి ఓ సబ్ కలెక్టర్ బాణా సంచాలు కాల్చారు. ఉత్సవాన్ని విజవంతంగా నిర్వహణకు ఏర్పాట్లు జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత విలేఖరులతో మాట్లాడుతూ ఈనెల 9,10,11 తేదీలలో మూడు రోజుల పాటు జాతర నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. గిరిజన ఆరాధ్యదైవం దర్శనానికి వివిద ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తారని చెప్పారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసారని చెప్పారు. పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ధీరజ్, పాడేరు మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి, ఆలయ కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 26 ఏళ్ల వయసులో ఎంపీ.. 36 యేళ్ళ వయస్సులో కేంద్ర మంత్రి



**నరసన్నపేట, జూన్ 9, మేజర్‌న్యూస్:** రికార్డ్ సృష్టించిన రామ్మోహన్ నాయుడు.నాడు పిన్నవయస్సులో కేంద్ర మంత్రి అయిన ?? కింజరాపు ఎర్రం నాయుడు నేడు తండ్రి రికార్డ్ ను బద్దలు కొట్టి కేంద్ర మంత్రి అయిన రామ్మోహన్ నాయుడు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేసే అవకాశం దక్కింది. ఆయన తనయుడైన రామ్మోహన్ నాయుడుకి ఇప్పుడు ఎన్ డిఏ ప్రభుత్వంలో ప్రధాని మోదీ నేతృత్వంలోని 3.0 కేబినెట్ లో మంత్రిగా పనిచేసే అవకాశం దక్కింది. ఎర్రన్నాయుడు మరణానంతరం 2012లో రాజకీయాలలోకి అడుగుపెట్టిన రామ్మోహన్ నాయుడు చిన్నతనం నుంచి రాజకీయాలను దగ్గరగా చూస్తూ రావడం వల్లనే అనతికాలంలోనే ఆయన ఈ రంగంలో రాణించారు. ఎర్రన్నాయుడు రాజకీయ వారసుడుగా 2014 ఎన్నికలలో తొలిసారి. తెలుగుదేశం పార్టీ తరపున శ్రీకాకుళం ఎంపిగా పోటీ చేసి విజయం సాధించిన రామ్మోహన్ తన పనితీరుతో అందరిని మెప్పించారు. ప్రజల ఆదరాభిమానాలను సొంతం చేసుకున్నారు. పార్టీలకి అతీతంగా అందరి మన్ననలను పొందారు. 2019లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గాలిలో కూడా ఆయన శ్రీకాకుళం ఎంపిగా విజయం సాధించారు. రాష్ట్రంలో ఎంపిలుగా పోటీచేసిన మహామహులు ఆ ఫ్యాన్ స్పీడ్ కి కొట్టుకుపోగా రాష్ట్రంలో ముగ్గురు టిడిపి ఎంపిలు గెలవగా వారిలో రామ్మోహన్ నాయుడు ఒక్కరుగా నిలిచారు. వైకాపా ప్రభుత్వ హయాంలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేయగా ఢిల్లీ స్థాయిలో రామ్మోహన్ నాయుడు చక్రం తిప్పారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలుసుకోవడం ఏపీలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు వారికి వివరించడం ఇలా కీలక పాత్ర పోషించారు. చంద్రబాబు నాయుడుకి, నారా లోకేష్ ల పక్షాన నిలిచి తానేంటో తన పనితీరు ఏంటో రామ్మోహన్ నాయుడు వారికి తెలియజేసారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో ఎన్ డిఏ కూటమి రాష్ట్రంలో విజయదుందుభి మ్రోగించగా 3.27 లక్షల మెజార్టీతో శ్రీకాకుళం ఎంపీగా గెలిచి కింజరాపు రామ్మోహన్ నాయుడు అనే నేను అంటూ కేంద్ర మంత్రిగా శ్రీకాకుళం యువ పార్లమెంట్ సభ్యుడు ఆదివారం సాయంత్రం ప్రమాణస్వీకారం చేసారు. రాష్ట్రపతి భవన్ లో జరిగిన కేంద్ర మంచి మంత్రి వర్గ ప్రమాణస్వీకారోత్సవంలో ఆంధ్రప్రదేశ్ రామ్మోహన్ నాయుడుకి అవకాశం రాగా అతిథుల సమక్షంలో ప్రమాణస్వీకారం చేసారు. తొలుత భారత ప్రధానిగా మూడవ సారి నరేంద్ర మోదీ ప్రమాణస్వీకారం చేయగా తరువాత చేసారు. ఆయన వరుసగా సీనియర్లు కేంద్ర మంత్రులుగా ప్రమాణస్వీకారం వరుస క్రమంలో ఈ ప్రమాణస్వీకారోత్స వాలు జరుగగా యువకుడైన కింజరాపు రామ్మోహన్ నాయుడు వారితో పాటుగా కేంద్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసారు. రాష్ట్రపతి ద్రౌపతి కేంద్ర ముర్ము మంత్రిగా రామ్మోన్ నాయుడుతో ప్రమాణస్వీకారం చేయించగా అధినేత ఆయన ప్రమాణపత్రం చదువుతున్నప్పుడు టిడిపి చంద్రబాబు నాయుడు ఆసక్తిగా తిలకించారు. ప్రమాణస్వీకారం ఆనంతరం రామ్మోహన్ నాయుడు మర్యాదపూర్వ కంగా రాష్ట్రపతికి నమస్కరించి అటు తర్వాత ప్రధాని కేంద్రమం త్రులు రాజనాథ్ సింగ్, అమిత్ షా తదితరులను మోదీ, కలుసుకుని వారికి కరచలనం చేసారు. కేంద్ర మంత్రి వర్ణ ప్రమాణస్వీకారోత్సవంలో సార్క్ సభ్యదేశాల ప్రతినిధులతో పాటు ఎన్డీఏ భాగ స్వామ్య పక్షాల అధినేతలతో పాటు దేశ నలుమూలల నుంచి పలువురు రాజకీయ, సినీ, వ్యాపార దిగ్గజాలు పాల్గొన్నారు. మోదీ ప్రమాణస్వీకారోత్సవానికి విచ్చేసిన విదేశీ ప్రముఖుల్లో బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, మాల్దీవుల అధ్యక్షుడు మొయిజ్జు, శ్రీలంక అధ్యక్షు డు రణిల్ విక్రమసింఘే, నేపాల్ ప్రధాని ప్రచండ. మారిసస్ ప్రధాని ప్రవింద్ జగన్నాథ్, భూటాన్ ప్రధాని షెరింగ్ టోబ్గే సహా పలువురు నేతలు ప్రత్యేక అతిథులు విచ్చేశారు. ఈ వేడుకకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సైతం హాజరయ్యారు. ఈ వేడుకలో ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్, సుప్రీంకోర్టు సీజే జస్టిస్ డీవై చంద్రచూడ్, మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్, మాజీ ఉపరాష్ట్రపతి. వెంకయ్యనాయుడు తెదేపా అధినేత చంద్రబాబు, జేడీయూ అధినేత నీతీశ్ కుమార్, జనసేన అధినేత పవన్ కల్యాణ్, ఎన్సీపీ నేత అజిత్ పవార్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, మహారాష్ట్ర సీఎం ఏక్నాథ్ శిందే, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ, సినీనటులు షారుక్ ఖాన్, రజనీకాంత్ తో పాటు భాజపా సీనియర్ నేత మురళీ మనోహర్ జోష్, కర్ణాటక మాజీ సీఎం యడియూరప్ప, గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ, ఆధ్యాత్మికవేత్త చినకయర్ స్వామి, పలు పీఠాలకు చెందిన అధిపతులు తరలివచ్చారు.. ఎంపిగా రామ్మోహన్ నాయుడు మూడవ సారి గెలిచి హ్యాట్రిక్ సాధించారు. టిడిపి, బిజెపి, జనసేనలు కూటముగా పోటీ చేసిన నేపథ్యంలో కేంద్రంలో చంద్రబాబు కీలకంగా మారడంతో రాష్ట్ర ఎంపిలకు కేంద్ర మంత్రి వర్గంలో చోటుదక్కింది. తెలుగుదేశం పార్టీనుంచి ఇద్దరికీ అవకాశం దక్కగా శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యుడుగా గెలుపొందిన సిక్కోలు సింహం కింజరావు రామ్మోహన్ నాయుడుకి కేంద్ర కేబినెట్ లో స్థానం దక్కింది. యువకుడైన రామ్మోహన్నాయుడుకి కేంద్ర మంత్రి పదవి దక్కడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. నాడు ఎర్రన్నాయుడు కేంద్ర మంత్రిగా సేవలందించగా నేడు ఆయన తనయుడైన రామ్మోహన్ నాయుడుకికేంద్ర మంత్రిగా పనిచేసే అవకాశం దక్కడం పట్ల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు కింజరాపు కుటుంబ అభిమానులుసంబరాలు చేసుకుంటున్నారు.

### రైతు భరోసా కేంద్రాలలో పంపిణీ చేసే
# విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి
## దామనపల్లి సర్పంచ్ కుందేరి రామకృష్ణ



**జీకే.వీధి, జూన్ 9, మేజర్‌న్యూస్:** మండలంలో రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని దామనాపల్లి సర్పంచ్ కుందేరి రామకృష్ణ అన్నారు.

ప్రస్తుతం దామనపల్లి పంచాయితీలో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సోమవారం రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. విత్తనాలు తీసుకునే రైతులు ఆధార్ కార్డు భూమి పత్రాల జిరాక్సులను సమర్పించాలన్నారు.

## తునివలస గ్రామంలో టీడీపీ, జనసేన సంబరాలు



**పద్మనాభం, జూన్ 9, మేజర్‌న్యూస్:** మండలంలో తునివలస గ్రామంలో గ్రామ మాజీ సర్పంచలు ఆర్.ఎ.ఎన్ మూర్తి, గులమజ్జి మహేష్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఆనందోత్సావాలతో సంబరాలు చేసుకున్నారు. అయితే భీమిలి నియోజకవర్గం కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు ఊహించలేని విధంగా మెజారిటీ రావడం వలన ఈ సంబరాలను నిర్వహించినట్లు చెప్పారు. డి.జె.తో గ్రామం అంతా తిరిగి పెద్దలు, యువకులతో పాటు మహిళలు కూడా కేరింతలతో నృత్యాలు చేసారు. అలాగే జగన్ అరాచక పాలనకు ప్రజలు ముగింపు పలికారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకరాలు నందినితో పలువురు పాల్గొన్నారు.

## నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు



**అనకాపల్లి, జూన్ 9, మేజర్‌న్యూస్:** ఉత్తరాంధ్ర ఇలివేల్పు అనకాపల్లిలో గవరపాలెంలో వెలిసిన శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో ఆదివారం అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దేవస్థానం ఆవరణలో వంటలు వండుకొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో క్యూ లైన్ లో భక్తులకు త్రాగునీరు, ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నామని ఆలయ అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బండారు ప్రసాద్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### జాతరలో వైద్య శిబిరాలు జాతరకు
## వచ్చే భక్తులకు ప్రత్యేక చికిత్సలు




**పాడేరు, జూన్ 9, మేజర్‌న్యూస్:** రాష్ట్ర గిరిజన జాతరగా పేరొందిన పాడేరు మోదకొండమ్మ అమ్మవారి జాతర సందర్భంగా ఆదివారం సుండ్రుపుట్టు వద్ద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరానికి హాజరైన 219 మంది రోగులకు దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాంబాబు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జమల్ భాషా మాట్లాడుతూ జాతరకు వచ్చే ప్రజలు ప్రత్యేక ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జాతరలో విక్రయించే నిల్వ ఆహారాన్ని, నిల్వ పానీయాలను తీసుకోవద్దన్నారు. ప్రస్తుతం ఏజెన్సీలో ఎపిడమిక్ సీజన్ కావడంతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వ్యాధులు ప్రభలితే వెంటనే సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్దకు వెళ్లి మెరుగైన చికిత్స తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ఆమె తెలిపారు. జాతరలో నిర్వహించే ప్రత్యేక వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాంబాబు, వైద్య సిబ్బందిసాంబశివరావు, మురళీ, సింహాచలం, డి. చంద్రమ్మ, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బండారును కలిసిన పోలీస్ అధికారులు



**పరవాడ, జూన్ 9, మేజర్‌న్యూస్:** మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని గతంలో పరవాడ పోలీస్ స్టేషన్లో సిఐలుగా పనిచేసిన పలువురు అధికారులు స్థానిక డిఎస్పి సత్యనారాయణతో పాటు కలిసి ఎమ్మెల్యేగా ఎన్నికైనందుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం పరవాడ మండలంలో గల వెన్నలపాలెం గ్రామంలో ఉంటున్న మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని పరవాడ డి.ఎస్.పి సత్యనారాయణ తో పాటు గతంలో పరవాడ పోలీస్ స్టేషన్ లో సీఐగా పనిచేసిన పైడుపునాయుడు, పిపి నాయుడు ,పివి రమణ ఈశ్వరరావు ప్రస్తుత సిఐ బాల సూర్యరావు, పరవాడ ఎస్సై సురేష్ తదితరులతోపాటు మరికొందరు పోలీసు అధికారులు కూడా బండారుని కలిసి అభినందించారు ఈ సందర్భంగా బండారుతో పోలీస్ అధికారులు ప్రత్యేకంగా సమావేశమై పలు విషయాలను చర్చించారు.

## రామోజీరావు మృతికి ఘన నివాళి



**పాచిపెంట, మే 9, మేజర్‌న్యూస్:** పత్రికా రంగంలో మకుటం లేని మహారాజుగా వెలిగొందిన ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ సి హెచ్ రామోజీరావు మృతికి పాచిపెంట పాత్రికేయులు ఘన నివాళులు అర్పించారు. ఆదివారం నాడు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పాచిపెంట మండల జర్నలిస్టు యూనియన్ అధ్యక్షులు నల్లి గోవిందరావు, ఈనాడు పాత్రికేయులు గ్రంధి వెంకట రాజు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూల దండ అలంకరించి సంతాపం తెలియజేశారు. ఆయన మరణం పత్రికా రంగానికి తీరని లోటని ఆవేదన చెందారు. ఈ కార్యక్రమానికి వారితో పాటు యూనియన్ కార్యదర్శి చిట్టూరి వెంకటరమణ, ఆరంగి రమేష్, ఎస్ ఆర్ టి పి ప్రసాద్ రాజు, పడాల వెంకటరమణ, లావేటి ఈశ్వరరావు, పాచిపెంట ఉమామహేశ్వరరావులు హాజరయ్యారు.